క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను నేడు(బుధవారం) వేలం పాట వేయనున్నట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు 50శాతం డిపాజిట్ చెల్లించి ఉదయం 10 గంటలకు పాల్గొనాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం



భూపాలపల్లిరూరల్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన భూపాలపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పరికిండ్ల వెంకటేశ్వర్లు(60) వృద్ధుడు ఈనెల 25న తప్పిపోయాడు. ఈ మేరకు అతడి భార్య భార్య ఉమా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆరెంజ్ కలర్ గల షర్టు, బ్లాక్ ప్యాంటు కల్గి ఉన్నాడని ఆచూకి తెలిసిన వారు 7013099709 లేదా 9030755298 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వగలరని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన సారయ్య (64) అనే వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొయ్యూరు ఎస్సై నరేష్ కథనం ప్రకారం సారయ్య మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు భార్య మదనమ్మ సైతం పుట్టింటికి వెళ్లింది. మానసిక స్థితి సరిగా లేక ఇంట్లో ఎవరు లేని సమయంలో సారయ్య ఇంటి ముందు రేకులకు ఉన్న పైపునకు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

ఉద్యమాలతోనే గీత వృత్తి రక్షణ



నర్సంపేట : ఉద్యమాల ద్వారానే గీత వృత్తిని రక్షించుకోగలమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకే ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా, సేఫ్టీ మోకులు, మోపెడ్, తదితరాలు ఇస్తామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరిస్తున్నాయని తెలిపారు. పాలక పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో గీత కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రమాదాల బారిన పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ఆదాయం కోసం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ గీత కార్మికుల బతుకులను దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు గౌడ కులస్తులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని చెప్పారు. రాజకీయాలకతీతంగా గౌడ కులస్తులు, గీత కార్మిక సంఘాలు ఏకమైతేనే సమస్యలు పరిష్కారమౌతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తదితరాలను వెంటనే విడుదల చేయడంతోపాటు గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని, నిర్వహణ కోసం రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌడిశాల సదానందం, రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి వెంకట్, నాయకులు గంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పలిమెల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ పున్నెం రామారావు గ్రామస్తులకు సూచించారు. మంగళవారం అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దమ్మూరు గ్రామ పంచాయతీలోని బూరుగ్గూడెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోకి ఇంటింటికి వెళ్లి వారి లక్షణాలను పరిగణలోకి తీసుకొని, బ్లడ్ సాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పున్నెం రామారావు మాట్లాడుతూ.. ప్రజలు తాగునీరు విషయంలో జాగ్రత్త వహించాలని, వేసవికాలంలో ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడం కోసం పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రామారావు

బయటి పనులకు వెళ్లే వారు డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మురళీధర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ, ఏఎన్ఎంలు పుష్ప, లావణ్య, ఆశాలు శ్రీలత, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 67 మంది మహిళలకు, 14 మంది కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 29 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

ముమ్మరంగా పోలీసుల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు



సోదాలు చేస్తున్న పేరూరు ఎస్సై రమేష్

వాజేడు: మండలంలో మంగళవారం పోలీసులు ముమ్మర తనిఖీలను చేపట్టారు. మండాల పరిధిలోని పాయ బాటలు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలను చేపట్టగా ధర్మవరం గ్రామ సమీపంలో పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను చేశారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారుల బ్యాగులను సోదాలు చేశారు. ముఖ్యంగా నగదు తరలింపులపై దృష్టిని కేంద్రీకరించారు. ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు అని ఆరా తీశారు.

గడుంబా విక్రయిస్తే చర్యలు



పట్టుకున్న నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

గోవిందరావుపేట: గడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వరంగల్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ భూపాలపల్లి, ములుగు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ములుగు ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధీర్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలంలోని రాంనగర్, పాపయ్యపల్లి, బాలాజీనగర్ గ్రామాల్లో తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ గ్రామంలో గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. దాడుల్లో 45 లీటర్ల నాటు సారాయిని, 120 కిలోల బెల్లాన్ని 500 గ్రాముల డై ఈస్ట్ పౌడర్‌ని స్వాధీనం చేసుకోని 2000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేసిన, రవాణా చేసిన, అమ్మిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో ములుగు ఎక్సైజ్ సీఐ సుదీర్ కుమార్, డీటీఎఫ్ సీఐ రాజ సమ్మయ్య, ఎస్‌టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి, ములుగు ఎక్సైజ్ ఎస్సై లింగయ్య గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, ఎస్‌టీఎఫ్ ఎస్సై బాలరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం వాయిదా

మల్హర్: మల్హర్ మండలం తాడిచర్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ చెప్యాల రామారావుపై పలువురు డైరక్టర్లు ప్రతిపాందిన అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. మంగళవారం జరగాల్సిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి డీసీఓ శైలజ ఉదయం 11 గంటలకు తాడిచర్ల సహకార సంఘం కార్యాలయానికి చేరుకోని 12:30 గంటలకు నుంచి వెళ్లిపోయారు. బలనీరుపణ కార్యక్రమానికి డైరెక్టర్లు ఎవరు కూడా హాజరు కాలేదు. అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరైతే కోరం లేక విగిపోతుందనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ డైరెక్టర్లు హాజరు కాలేదని సమాచారం. అలాగే బీఆర్ఎస్ డైరెక్టర్లు క్యాంపులోనే ఉన్న విషయం తెలిసందే. కాగా అడ్మినిస్ట్రేటివ్ కారణం రీత్య నేటికి (బుధవారం)వాయిదా వేసినట్లు డీసీఓ శైలజ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి పాలక వర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

అరుణ్‌కుమార్‌ను గెలిపించాలి

ఎస్ఎస్ తాడ్వాయి: మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీగా డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొరగట్ల లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి విద్యార్థి, మహిళ తుడుందెబ్బ నేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ ఉద్యమ నేత డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన గెలుపుతో అన్ని రాజకీయ పార్టీలకు కనువిప్పు కలగాలన్నారు. అనంతరం మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. లంబాడీల వలన ఆదివాసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లేబోయిన లక్ష్మణ్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలు వట్టం సుభద్ర, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్, ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి గావిడి నాగబాబు, నాయకులు బడిశా, అదినారాయణ, గట్టిపల్లి అర్జున్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు పాయం కోటేశ్వర్‌రావు, అన్నెబాయిన సమ్మయ్య, మండల అధ్యక్షులు మోకాళ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి యాలం విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఇసుక లారీలతో తప్పని తిప్పలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఇసుక లారీలతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. లారీలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్న పట్టించుకునే నాథుడే కరువైయ్యారని మండల వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి ప్రతి రోజు ఇసుక లారీలు భారి సంఖ్యలో వెళ్తుంటాయి. ఈ లారీల వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడుతుంది. అత్యవసర సేవలను అందించే 108 వాహనానికి సైతం దారి వదిలే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు ఇసుక లారీలను పగలు కాకుండా రాత్రి సమయాల్లో వెళ్లేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాజేడు: ఇసుక లారీలతో ప్రతీ రోజు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ధర్మవరం, అయ్యవారిపేట ఇసుక క్వారీల నుంచి ప్రతీ రోజు 100 లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక క్వారీ నుంచి లారీలు వందల సంఖ్యలో రహదారిపై నిలిపి ఉంచడంతో పాటు లోడ్ లారీలు వెళ్తుండటంతో వాటి వెనుకాల వచ్చే వాహనాలతో పాటు ముందు నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి చెరుకూరు వరకు సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు ఎలా వెళ్లలో అర్థం కాని పరిస్థితి. లారీలను దాటుకుని వెళ్లడానికి గంటల సమయం పడుతుందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా అధికారులు కూడా పట్టించు కోకపోవడంతో వాహనదారులు రోడ్డు దిగి కింద నుంచి అడవి దారిగుండా వెళ్లాల్సి వస్తుంది. ఈ సమస్య ఇలాగే కొనసాగితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకటాపురం(కె): ఇసుక లారీల రద్దీతో నిలిచిన ట్రాఫిక్



వాజేడు: రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



వాజేడు: నిలిచిన లారీల వల్ల ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రైతులకు అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

కాటారం: పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. సమగ్ర వ్యవసాయ విధానం, ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగంలో భాగంగా డ్రోన్‌లు వినియోగించడంపై రైతులకు వివరించారు. రైతులు పంటల సాగులోని పలు సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి గిరి రామకృష్ణ, ఏఈఓలు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

‘చేనేతమిత్ర’ను కొనసాగించాలి

శాయంపేట : రాష్ట్రంలోని చేనేత కార్మికులకు చేనేత మిత్ర పథకాన్ని కొనసాగించాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని చేనేత జౌళీశాఖ కమిషనర్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. బీసీ వర్గంలో పేదరికం అనుభవిస్తున్న పద్మశాలీలు రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితిలో ఉంటూ సరైన ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వినతిలో పేర్కొన్నారు. చేనేతతో పాటు పవర్‌లూమ్స్ కూడా మూతపడుతున్నాయని, మరమగ్గ కార్మికులకు ప్రతినెల రూ. 10వేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేతమిత్ర ద్వారా ప్రతి చేనేత కార్మికుడికి రూ. 2వేలు, సహాయకుడికి రూ. 5వందల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవని తెలిపారు. ప్రస్తుతం జకమ కావడం లేదని, ప్రభుత్వం స్పందించి చేనేతమిత్ర పథకాన్ని కొనసాగించాలని కోరారు.

విరాళం అందజేత

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమానికి అదే గ్రామానికి హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ రావుల సాయిరెడ్డి రూ.1లక్ష మంగళవారం విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యుడు దొంతు రాంరెడ్డి తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన పోలోజు సత్యనారాయణ దంపతులు గుడి నిర్మాణం కోసం గ్రామస్తులతో కలిసి కమిటీని ఏర్పాటు చేసి గుడిని నిర్మించారని అన్నారు. ఈ మేరకు ఏప్రిల్ 5న ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంబుల తిరుపతి, గ్రామస్తులు కుమారస్వామి, పోలోజు సంతోష్, గుడిపాటి రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, నూనె రవీందర్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ సాయిరెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమెను మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. సీతక్క వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, మండల నాయకుడు సంగం రాము, రంగరబోయిన జగదీష్, మహిళా నాయకురాలు కన్నెబోయిన చంద్రకళ పాల్గొన్నారు.



సృజనను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపేయాలి

మంగపేట: మండలంలోని బోరు నర్సాపురంలో పట్టా నంబర్లపై ఇసుక క్వారీ అనుమతులను పొంది నిబంధనలకు విరుద్ధంగా గౌరారం వాగులో చేపట్టిన అక్రమ ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని బోరు నర్సాపురం గ్రామస్తులు మంగళవారం మన్నెం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరాస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు చూపి పక్కన ఉన్నటు వంటి గౌరారం వాగులో అక్రమ ఇసుక తవ్వకాలను జరుపుతున్నారని వారు ఆరోపించారు. అంతే కాకుండా అటవీ ప్రాంతం నుంచి మొరాన్ని ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి వాగులో అక్రమంగా రహదారులను నిర్మిస్తున్నారని అయినప్పటికీ సంబంధిత రెవెన్యూ, అటవీ శాఖాధికారులు ఇసుక కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పట్టించు కోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్, అటవీశాఖ జిల్లా అధికారి, మైనింగ్ శాఖధికారులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బోరునర్సాపురం గ్రామస్తులు

చేనేత కార్మికులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : చేనేత కార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని మంగళవారం సందర్శించి గోడౌన్‌లో నిల్వఉన్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్నిరంగాలు దివాలా తీశాయని ఆరోపించారు. మండలంలోని చేనేత సొసైటీలో గతంలో 100మంది కార్మికులు పనిచేసేవారని ప్రస్తుతం 20మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారని పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు తెలుపగా చేనేత కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసికెళ్లి సమస్యలను పరిష్కరింపజేస్తానని అన్నారు. సొసైటీలో నిల్వవున్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. బకాయిలున్న 20లక్షల నిధులను ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేద చేనేత కార్మికులకు ఇంధిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మిగిలిన గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. రూ. 30లక్షలతో త్వరలో శాయంపేటకు అంబులెన్స్ అందజేస్తానని తెలిపారు. అనంతరం 100రోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఎంపీటీసీ చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్ శంకర్‌లింగం, సభ్యులు లక్ష్మీనారాయణ, ఆనందం, ప్రభాకర్, సమ్మక్క, పద్మ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి రవి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సొసైటీలో వార్పింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

ఉచిత మెగా వైద్యశిబిరం

నల్లబెల్లి : హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని రాంపూర్ మాజీ సర్పంచ్ చింతపట్ల సురేశ్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి యాజమాన్యం స్వగ్రామంపై మమకారంతో సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి మండలంలోని మేడపల్లి, రాంపూర్, తదితర గ్రామాల ప్రజలు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన ఆర్థో, గైనిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజిషియన్, చిల్డ్రన్, అంకాలజీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావ్య, శిల్పరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మణి సేవారణ్, ప్రశాంత్, ఖలీల్, బాలకృష్ణ ఉన్నారు.